ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి
ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా బొత్స సత్యనారాయణ




సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా వి.విజయసాయిరెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు.



మహిళపై గొర్ర గేదె దాడి

మారేడుమిల్లి మండలంలో నిమ్మతోటలో కాయలు కోస్తున్న మహిళపై గొర్ర గేదె దాడి చేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది.

8లో

న్యూస్‌రీల్

154 వినతుల స్వీకరణ



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ, పీవో, సబ్ కలెక్టర్

పాడేరు: మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 154 అర్జీలను స్వీకరించారు. శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఆర్వో బి.పద్మావతికి వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ ఈఈలు డీవీఆర్‌ఎం రాజు, కె.వేణు గోపాల్, పీఆర్ ఈఈ టి. కొండయ్యపడాల్, జిల్లా వ్యవసాయాధికారి నందు, ఇంచార్జి డీడీ ఎల్ రజని,డీఎంహెచ్‌వో జమల్‌బాషా, డీపీవో బి. లవరాజు, డీఎల్పీవో పీఎస్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ వి. మురళీ, ఆర్ అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, సీపీవో ఎస్‌ఎస్‌ఆర్‌కే పట్నాయక్ పాల్గొన్నారు.

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ స్థల పరిశీలన



పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నర్సింహరావు

సీలేరు: పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేసిన ప్రాంతాన్ని చింతపల్లి డీఎఫ్‌వో నర్సింహరావు శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అటవీ అనుమతులు పెండింగ్‌లో ఉన్నందున త్వరలో అటవీ ఉన్నతాధికారులు పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన జొన్నమామిడి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. ఇందుకు అవసరమైన స్థలం అవసరాన్ని ఎస్ఈ చంద్రశేఖర్ నుంచి తెలుసుకున్నారు. అనంతరం అటవీశాఖ లాగింగ్ కూపి వెనుక భాగం పరిశీలించారు. తరువాత పార్వతీనగర్‌లో జలవిద్యుత్ కేంద్రం నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. శాండికోరి ప్రాంతాన్ని సందర్శించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అటవీ ప్రాంతం వివరాలను డీఆర్వో సింహాచలం పడాల్ ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి సుంకరి వెంకటరావు, డీఈఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల పరిశీలన



చింతపల్లిలోని బాలసదనాన్ని సందర్శించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ధర్మారావు

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లోని బాలబాలికల సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయలను అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు శుక్రవారం పరిశీలించారు. ముందుగా ఆయన లంబసింగి, తాజంగి, చింతపల్లిలోని ఏపీ గురుకుల కళాశాల, చింతపల్లిలోని బాలసదనం వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడ వసతులు, సౌకర్యాలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఐసీడీఎస్ పీవో రమణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

- 62 మంది ఎంపిక



ఎంపికైన వారికి నియామక పత్రాలు ఇస్తున్న సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో శుక్రవారం ఐటీఐ, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. అపోలో ఫార్మసీ, నవతారోడ్ ట్రాన్స్‌పోర్టు, భారత్ పే, ఎయిర్‌టెల్ బ్యాంక్ పేమెంట్ తదితర కంపెనీల ప్రతినిధులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు 195 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కాగా, 62 మందిని ఎంపిక చేసినట్టు వారు పేర్కొన్నారు. ఈ మేళాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరకు సీఐ ఎల్.హిమగిరి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఉపాధి కల్పన అధికారి, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, సీడాప్ సంస్థ ప్రతినిధి భారతి, ఉపాధి కల్పన అధికారి రోహిణి పాల్గొన్నారు.

సేంద్రియం c/o మన్యం

గిరి రైతులు ఆరోగ్యకర పంట ఉత్పత్తులను సాధిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. చిరుధాన్యాలు మాదిరిగానే కూరగాయలను సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో అధిక దిగుబడులు సాధించారు. వీటిని వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో మంచి ఆదాయం పొందుతున్నారు.

ఆరోగ్యకర ఉత్పత్తులను పండిస్తున్న గిరి రైతులు

- సేంద్రియ విధానంలో కూరగాయల సాగు
- మైదాన ప్రాంతంలో మంచి డిమాండ్
- గిట్టుబాటు ధర లభిస్తుండటంతో గిరి రైతుల్లో ఆనందం
- పోటీ పడి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- వ్యవసాయ ఉత్పత్తులతో సందడిగా మార్కెట్లు
- మైదాన ప్రాంతాలకు తరలింపు



దుంబ్రిగుడ మండలం కమలబందలో క్యాబేజీ సాగు



పాడేరు పాత బస్టాండ్‌లో మార్కెట్‌కు కూరగాయలను తీసుకువచ్చిన గిరి రైతులు

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన రైతులు సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి పంటలను సాగు చేస్తూ సుస్థిర ఆదాయం పొందుతున్నారు. ఇక్కడ పండించే ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నందున వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి.

- అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, ముంచంగిపుట్టు, చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో 4017 ఎకరాల్లో కూరగాయలను పండిస్తున్నారు.క్యారెట్, ముల్లంగి, కాలిఫ్లవర్, క్యాబేజీ, టమాటా, వంగ, బెండ, బీర, క్యాప్సికం, హైబ్రిడ్ ఆగాకార ,కాకర, గుమ్మడి, ఆనప, పచ్చిమిర్చి, అల్లం, బంగాళదుంప, తియ్య దుంపలు తదితర రకాలను సాగు చేస్తున్నారు. వీటితోపాటు తోటకూర, కొత్తిమీర, చుక్కకూర, గోంగూరను పండిస్తున్నారు. ఇవన్నీ ప్రస్తుతం దిగుబడి దశకు చేరుకున్నాయి. ఏజెన్సీలోని వారపు సంతల్లో వీటి అమ్మకాలు ఊపందుకున్నాయి. శుక్రవారం పాడేరులో సంతలో కూరగాయల వ్యాపారం భారీగా జరిగింది.
- ఏజెన్సీలోని కాశీపట్నం, సుంకరమెట్ట, అరకు, కించుమండ, హుకుంపేట, పాడేరు, ముంచంగిపుట్టు, అన్నవరం, లోతుగెడ్డ జంక్షన్, తాజంగి, చింతపల్లి, సీలేరు, ధారకొండ సంతల్లో కూరగాయల మార్కెట్ ప్రారంభమైంది. ధరలు ఆశాజనకంగా ఉన్నందున గిరిజన రైతులకు మంచి ఆదాయం సమకూరుతోంది.
- క్యాబేజీ 40కిలోల బస్తా రూ.800, క్యారెట్ పది కిలోల బుట్ట రూ.300, టమాటా పది కిలోల బుట్ట రూ.600 నుంచి రూ.700కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కూరగాయల మార్కెట్లలో కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులను వ్యాపారులు విజయనగరం, విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి, తుని, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.
- ఏజెన్సీకి చెందిన 500 మంది గిరిజన రైతులకు రైతు బజార్లలో విక్రయించేందుకు ఉద్యానవన, మార్కెటింగ్ శాఖలు అవకాశం కల్పించాయి. ఈ మార్గంలో కూడా వారు మంచి ఆదాయం పొందుతున్నారు.




పాడేరు మార్కెట్‌కు గిరి రైతులు తీసుకువచ్చిన చిక్కుళ్లు, క్యారెట్ ఉత్పత్తులు

దిగుబడి బాగుంది



ఈఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో కూరగాయ పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరా విస్తీర్ణంలో క్యాబేజీతో పాటు కాలిఫ్లవర్, టమాటా పంటలను వేశా. పంట దిగుబడులు రావడంతో అరకు, కించుమండ సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నా.

– పొట్టంగి రాంప్రసాద్, గిరిజన రైతు, దేముడువలస, డుంబ్రిగుడ మండలం

సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్



మన్యంలో కూరగాయ పంటలను సేంద్రియ విధానంలో పండించడం వల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అందుకు తగ్గట్టుగానే రైతులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నాం. విశాఖ రైతుబజార్లలో నేరుగా గిరిజన రైతులు అమ్ముకునేలా కార్డులను పంపిణీ చేశాం.

– రమేష్‌కుమార్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి, పాడేరు

ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్సులో మద్యం దుకాణం

- అభ్యంతరం తెలిపిన గిరిజన సంఘం
- తొలగించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



అరకులోయలో ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్సులో ఏర్పాటుచేసిన మద్యం దుకాణం

అరకులోయ రూరల్: పర్యాటక కేంద్రమైన అరకులోయలో గిరిజన నిరుద్యోగుల కోసం పాడేరు ఐటీడీఏ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.ఈ కాంప్లెక్స్‌లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని గతంలో ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలు జారీ చేశారు. అయితే వీటిని ఉల్లంఘించి ఓ మద్యం లైసెన్సు పొందిన వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడంపై గిరిజన సంఘం అభ్యంతరం తెలిపింది. దీనిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించింది. ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్సు మద్యం దుకాణం ఏర్పాటుపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. వెంటనే కాంప్లెక్సులోంచి దుకాణాన్ని తొలగించాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



హాజరైన ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికపై జేసీ అభిషేక్ గౌడ్ సూచన

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంఈవోలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 6వ తేదీలోగా అర్హులైన ఉపాధ్యాయులంతా ఫారం 19ద్వారా ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు మళ్లీ ఈనెల 25న నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వచ్చే నెల 23న ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ జారీ చేస్తామన్నారు. డిసెంబర్ 9వరకు అభ్యంతరాలు స్వీకరించి 30న తుది జాబితాను ప్రచురితం అవుతుందన్నారు. ఓటరు నమోదుకు నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లు జతచేయాలని కోరారు. డీఆర్వో పద్మావతి, డీఈవో పి.బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్

సాక్షి,పాడేరు: జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రహదారి భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక సీజన్ కావడంతో ఘాట్‌రోడ్లలో రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. వాహన చోదకులు ప్రమదాలకు గురికాకుండా అన్ని భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించేలా చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఘాట్‌రోడ్లలో కొమ్మలు, పొదలు తొలగించాలని,అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ, పీఆర్, జాతీయ రహదారుల సంస్థ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గోల్డెన్ అవర్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని, జిల్లా ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్‌ను క్రమబద్ధీకరించి అంబులెన్సులు తిరగడానికి వీలు కల్పించాలని, అన్ని ఆస్పత్రులకు ఐఆర్‌డీఏ లాగిన్ ఇవ్వాలన్నారు. సలుగు, కొరవంగి రూట్లలో మినీ బస్సులు అవసరం ఉన్నందున వాటి సరఫరాకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి లీలాప్రసాద్, మోటార్ వాహనాల అధికారి రాజేష్, ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, పాడేరు సీఐ జగబంధు, 104,108 వాహనాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గల్లంతైన గిరిజనుడి కోసం గాలింపు

- రంగంలోకి దిగిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- మత్స్యగెడ్డలో లభ్యంకాని ఆచూకీ
- ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు, బంధువులు



ఎద్దపేట వద్ద మత్స్యగెడ్డలో గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు




పర్యవేక్షిస్తున్న సీఐ వెంకటరావు, అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ పెద్దపేట వద్ద మత్స్యగెడ్డ దాటుతూ గురువారం గల్లంతైన గిరిజనుడి ఆచూకీ లభ్యం కాలేదు. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేటకు చెందిన కొర్రా వేణుగోపాల్‌స్వామి వ్యవసాయ పరికరాలకు సాన పెట్టేందుకు నాటు పడవపై వెళ్తుండగా ప్రమాదానికి గురికావడం తెలిసిందే. పడవలోకి నీరు చేరడంతో బోల్తాపడింది. ఈ ఘటనలో గల్లంతైన వేణుగోపాల్‌స్వామి ఆచూకీ లభ్యకాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ విశాఖ నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించారు. పెద్దపేట గ్రామానికి చేరుకున్న బృందం సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలింపు చేపట్టారు. ముంచంగిపుట్టు, పెదబయలు సరిహద్దు ప్రాంతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ వైకుంఠం ఆధ్వర్యంలో ముమ్మరంగా గాలించారు. వీరికి పెద్దపేట, రోగులపేట గ్రామాల గిరిజనులు సహకారం అందించారు. ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు నిలిపివేశారు. నీటమునిగిన పడవ కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉందని ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ వైకుంఠం తెలిపారు. జి.మాడుగుల సీఐ వెంకటరావు, తహసీల్దార్లు నర్సమ్మ, రంగరావు, ఎస్ఐలు రవీంద్ర, రమణ గాలింపు చర్యలను పర్యవేక్షించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వేణుగోపాల్ స్వామి కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకున్నారు. అతని ఆచూకీ లభిస్తుందని శుక్రవారం సాయంత్రం వరకు వారు ఎదురుచూశారు.

విద్యార్థి దశలో కెరీర్ గైడెన్స్ కీలకం

అవగాహన సదస్సులో ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : విద్యార్థి దశలో కెరీర్ గైడెన్స్ పాత్ర కీలకమని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సూపర్ 50 పేరిట విద్యార్థులకు అందిస్తున్న బోధన విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పది తరువాత ఇంటర్‌లో ఎలాంటి గ్రూపులు తీసకోవాలో ఆయన వివరించారు. డిగ్రీ ద్వారా ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో తెలిపారు. బైపీసీలో చేరితే అనేక రకాల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్పై దృష్టి సారిస్తే మంచి అవకాశాలు వస్తాయన్నారు. పది తరువాత ఐటీఐ/పాలిటెక్నికల్ కోర్సులు చేస్తే సాంకేతికంగా అవకాశాలు ఉంటాయన్నారు. ఉన్నతస్థానాల్లో ఉండాలన్న లక్ష్యం ఉంటే యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలు రాస్తే ఏఐఎస్ సర్వీసులకు ఎంపిక అవుతారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడీ రజని పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

సాక్షి,పాడేరు: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం 2024–25కు సంబంధించి టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగించినట్టు డీవో పి.బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆర్.శశికుమార్ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 25వరకు గడువు పొడిగించారన్నారు. రూ.200 ఆలస్య ఫీజుతో ఈనెల 29 వరకు, రూ.500 ఆలస్య ఫీజుతో ఈనెల 31వతేది వరకు www.apopenschool.ap.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాల వయసు నిండినవారు, ఇంటర్‌లో చేరేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులై, 15 సంవత్సరాల వయసు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వారు పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు, జరిమానా

అడ్డతీగల: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన హత్యాయత్నం కేసులో నేరారోపణ రుజువుకావడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్ష రూ.10 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బి.పద్మ శుక్రవారం తీర్పు చెప్పినట్టు ఎస్‌ఐ వినోద్ తెలిపారు. అడ్డతీగలకి చెందిన మామిడి లోవప్రసాద్ కోనలోవలో కరెంటు పని చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన తిరగాటి రమేష్ గొడ్డలితో లోవప్రసాద్ తలపై వెనుక భాగాన్న బలంగా నరికాడని చెప్పారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం రమేష్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. విచారణ అనంతరం నేరాభియోగం రుజువు కావడంతో హత్యాప్రయత్నం చేసిన రమేష్‌కు ఏడాది సాధారణ జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని వివరించారు.ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పి.వి.వి.ఎస్.బి రాజు తన వాదనలు వినిపించారు.

పర్యాటక విద్యా ప్రాప్తిరస్తు

పర్యాటక రంగంలో విజ్ఞాన కేంద్రాలను విద్యార్థులందరికీ అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో, జిల్లా పర్యాటక సంస్థ జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలు, స్కూల్స్ విద్యార్థులందరికీ ఎడ్యుకేషనల్ పర్యటనను రూపొందించింది. విజ్ఞానాత్మక కేంద్రాలను విద్యార్థులకు చేరువ చేస్తున్నారు. ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా విద్యార్థుల్లో మరింత విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో టూరిజం అధికారులు వినూత్న విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వివిధ మార్గాల ద్వారా ఎడ్యుకేషనల్ టూరిజంపై విద్యార్థుల్లో చైతన్యం నింపాలని భావిస్తున్నారు.



- టూరిజం స్పాట్స్‌పై విద్యావగాహన
- అధికారుల వినూత్న ఆలోచన
- పర్యాటక ప్రాంతాల్లో నేటి నుంచి ఎడ్యుకేషనల్ టూర్స్
- ప్రభుత్వ బడులు, కళాశాల విద్యార్థులకు ఉచిత ప్రవేశం...ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలకు ప్రవేశరుసుం రూ.10 మాత్రమే
- మెరైన్, జీవ వైవిధ్యం, తీర పర్యావరణ విభాగాల్లో అవగాహన

సాక్షి, విశాఖపట్నం : ప్రకృతి చెప్పే పాఠాలే.. విద్యార్థి భవిష్యత్తుకు దిక్సూచీగా నిలుస్తాయి. బడిలో చెప్పిన చదువు.. పర్యావరణంలో అన్వేషిస్తే.. ఆ పాఠం జీవితాంతం గుర్తుండిపోతుంది. అందుకే విద్యను పర్యాటకంతో మమేకం చేస్తూ జిల్లా టూరిజం అధికారులు వినూత్న ఒరవడికి తెరతీశారు. పర్యాటక ప్రాంతాల్లో ఎడ్యుకేషనల్ టూర్స్‌కు శ్రీకారం చుట్టారు. స్కూల్స్, కాలేజీల్లో విద్యనభ్యసిస్తున్న వారికి మూడు విభాగాల్లో అవగాహన కల్పించేలా ఎడ్యుకేషన్ టూరిజం ఐటినరీ పేరుతో కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభించనున్నారు.

'ప్రభుత్వ' విద్యార్థులకు ఫ్రీ

జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో విద్యార్థుల అభ్యాసానికి పనికొచ్చే ప్రాంతాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో విద్యార్థులకు రాయితీతో కూడిన ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులకు కేవలం రూ.10 టికెట్‌తో ప్రవేశం కల్పించేలా ఏర్పాట్లు చేశారు.

ట్రిపుల్ 'యాత్ర'

విద్యార్థులకు సంబంధించి ఎడ్యుకేషన్ టూరిజం ఐటినరీని మూడు విభాగాలుగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అవేంటంటే...

1 మెరైన్ మ్యూజియం ఎడ్యుకేషనల్ టూర్

ఈ టూర్‌లో భాగంగా సాగరతీరంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. సీ హారియర్ మ్యూజియం, టీయూ–142, ఐఎన్ఎస్ కురుసుర సబ్‌మెరైన్, మారీటైమ్ మ్యూజియంలను విద్యార్థులు సందర్శిస్తారు. అనంతరం అక్కడి నుంచి టైడ్‌పూలింగ్‌కు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు. సముద్ర తీరంలో ముఖ్యంగా ఆర్‌కేబీచ్, సాగర్‌నగర్ తీరాల్లోని రాళ్లు, ఒడ్డున ఉన్న సముద్ర జీవుల అన్వేషిస్తారు. ఈ యాత్ర ద్వారా చరిత్ర, జీవావరణ శాస్త్రంపై అధ్యయనం చేసినట్లుగా జ్ఞానాన్ని సముపార్జించే అవకాశం లభిస్తుంది.



2 జీవవైవిధ్య విద్యా పర్యటన



ఈ పర్యటనలో భాగంగా పర్యావరణంలో ఉన్న జీవరాశుల అధ్యయనాన్ని అన్వేషించే అవకాశం లభిస్తుంది. ముందుగా ఇందిరా గాంధీ జులాజికల్ పార్క్‌ను సందర్శించి, అక్కడి నుంచి కాపులుప్పాడ సమీపంలో ఉన్న బయోడైవర్సిటీ పార్క్‌లో ఉన్న పర్యావరణ వ్యవస్థను పరిశీలిస్తారు. జీవవైవిధ్య కేంద్రానికి చిరునామాగా ఉన్న తూర్పు కనుమలలో కనిపించే ప్రత్యేకమైన జీవవైవిధ్య పరిరక్షణ, అధ్యయనంపై విద్యార్థులకు అద్భుతమైన పాఠాలు అందించే కేంద్రాలివి. వీటన్నింటి కంటే దట్టమైన కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలో కొన్ని ట్రెక్కింగ్ అనుభవాలను కూడా విద్యార్థులు సొంతం చేసుకోవచ్చు.

3 తీర పర్యావరణ వ్యవస్థ యాత్ర...



ఇందులో భాగంగా.. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్న జీవశాస్త్ర ప్రయోగశాలని విద్యార్థులు సందర్శించవచ్చు. ఎఫ్ఆర్‌సీసీఈ మడ అడవుల పరిశోధన కేంద్రం, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియంకి వెళ్లే అవకాశం కలుగుతుంది. ఈ యాత్ర ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఆయా జీవులు ఏవిధంగా దోహద పడుతుంటాయి.. ప్రకృతి ప్రశాంతంగా ఉండాలంటే వాటిని ఎలా కాపాడుకోవాలనే అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలుగుతుంది. ఈ యాత్రలో భాగంగా తీర ప్రాంత పరిశోధనలకు సంబంధించి మెరైన్ లైవ్ వాక్ కూడా అనుసంధానం చేస్తున్నారు.

ప్రాథమిక స్థాయి నుంచి అవగాహన



పర్యావరణంతో మమేకమవుతూ జ్ఞానాన్ని సముపార్జించుకునేందుకు విద్యార్థులకు వీఎంఆర్‌డీఏతో కలిసి టూరిజం శాఖ అందిస్తున్న గొప్ప అవకాశం ఇది. ఇప్పటికే ఎడ్యుకేషనల్ టూరిజం ఐటినరీకి సంబంధించిన బ్రోచర్లను ఆంధ్ర యూనివర్సిటీ, డిగ్రీ కళాశాలలకు, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు, జిల్లా విద్యాశాఖకు అందజేశాం. జిల్లాలో గల అన్ని విద్యాసంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులకు పర్యావరణ విద్య తో పాటు లెర్నింగ్ స్కిల్స్ డెవలప్ అయ్యేందుకు కృషి చెయ్యాలని కోరుతున్నాం. జిల్లాలోని ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్యా సంస్థలు భాగస్వామ్యం అయ్యేలా కార్యచరణ రూపొందించాం.

– జ్ఞానవేణి, విశాఖ జిల్లా పర్యాటక అధికారి

కారుణ్య నియామకాలు చేపట్టాలి

అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి

మహారాణిపేట (విశాఖ): విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్‌ను అరకు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ జి.తనూజారాణి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ఇది వరకు మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబీకులకు అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం (కారుణ్య నియామకం) కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో కారుణ్య నియామకాలు చేపడతామని తెలిపారు. అరకు ఎంపీతో పాటు వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తడబారికి సురేష్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి

బాల్య వివాహాలు జరిపిస్తే చర్యలు

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: బాల్యవివాహాలు జరిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండకుండా ఎవరైనా బాలికలకు పెళ్లి చేస్తే చట్టపరంగా శిక్షించబడతారని తెలిపారు. అన్ని పాఠశాలల్లో, గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలన కొరకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత అంగన్‌వాడీ టీచర్‌కు, పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే టోల్‌ఫ్రీ నెంబరు 109, 100, 1098కు ఫోన్ చేసి సమాచారం తెలపాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమ ప్రచార పోస్టర్లను సబ్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి, ఏడీఎంహెచ్‌వో శిరీష, సీఐ రవికుమార్, ఏటీడబ్ల్యూవో రామతులసి పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ఏకలవ్య పాఠశాల పనులు వేగవంతం

ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశం

అడ్డతీగల: ఏకలవ్య స్కూల్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఐటీడీఏ పిఓ కట్టా సింహాచలం ఆదేశించారు. ఈ మేరకు అడ్డతీగలలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పనుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తే ఇక్కడే గిరిజన విద్యార్థులకు విద్యకు సంబంధించిన సదుపాయాలన్నీ ఏర్పాటు చేయవచ్చన్నారు. ఇక్కడ భవన వసతి లేకపోవడం వల్ల అడ్డతీగల ఏకలవ్య స్కూల్ విద్యార్థులు ప్రస్తుతం రాజవొమ్మంగి ఏకలవ్య స్కూల్‌లోనే విద్యాభ్యాసం సాగించాల్సి వస్తుందన్నారు. దీనిపై స్పందించి భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



అడ్డతీగల ఏకలవ్య స్కూల్ భవనం ప్రగతిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

మహిళపై గొర్ర గేదె దాడి

మారేడుమిల్లి : గొర్ర గేదె దాడి చేయడంతో ఓ గిరిజన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గుజ్జుమామిడి వలస గ్రామానికి చెందిన మట్ల చంద్రకాంత గ్రామ సమీపంలోని నిమ్మ తోటలో కాయలు కోస్తోంది. ఈ సమయంలో సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చిన గొర్ర గేదె ఆమెపై దాడి చేసింది. దీంతో ఆమె కాలు విరిగిపోయింది. మొహం మీద తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు స్థానిక పీహెచ్‌సీకీ తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎలుగుబంటి దాడిపై వివరాల సేకరణ



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు



ఎలుగుబంటి తీసిన గుంట

- పిత్తగుడలో అటవీ అధికారుల సందర్శన
- గ్రామస్తులకు సూచనలు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నెల పంచాయతీ పిత్తగుడ గ్రామంలో గురువారం ఎలుగుబంటి దాడిలో గాయపడిన గ్రామస్తుల సంఘటనపై అటవీ శాఖ రేంజ్ జిల్లా అధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, ఆధ్వర్యంలో టీమ్ గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామంలో గురువారం జరిగిన ఎలుగుబంటి దాడికి సంబంధించిన వివరాలను గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఎలుగుబంటి దాడిలో గాయపడిన ముగ్గురు గిరిజనులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందించి తగు న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు. ఎలుగుబంటి సంచారం గురించి పరిసర గ్రామాలకు దండోరా వేయించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అడవి జంతువుల దాడుల బారి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీట్ అధికారులు రేణుక, ఉద్దంగి, రామచంద్రరావు, చంటిలు గుంటగన్నెల సర్పంచ్ పి.మోతీలాస్, స్థానికులు పాల్గొన్నారు.

అడవి జంతువుల ఉసురు తీయొద్దు

వై.రామవరం: అడవి జంతువుల వేట కోసం కొండలపైన, పొలాల సమీపంలో, అటవీ ప్రాంతంలో, జనసంచార ప్రాంతాల్లోను అనధికారికంగా విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీసు యంత్రాంగం పేరిట మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం హెచ్చరిక పోస్టర్లు వెలిశాయి. ఈ తీగలు అమర్చడం వలన ఎంతోమంది అమాయక గిరిజనులు మృత్యువాత పడుతుండడంతో, ఆ విద్యుత్ తీగలు అమర్చిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆ పోస్టర్ల ద్వారా హెచ్చరించారు. ఇకపై అటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే నిందితులు ఎంతటివారైనా క్షమించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ఈ హెచ్చరికకు స్పందించి తక్షణమే విద్యుత్ తీగలతో అడవి జంతువుల వేట మానుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం కోరింది.

అరకులో షూటింగ్ సందడి

- వారపు సంతలో సినిమాయ చిత్రం సన్నివేశాల చిత్రీకరణ

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయిలులో శుక్రవారం జరిగిన వారపు సంతలో సినిమాయ చిత్రంలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. విజయ్‌వీర్, సస్మిత జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి కథ, రచన, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం గిరి చిన్నా వహిస్తున్నారు. అరకు సినీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో శ్రీమతి రాజసాగి రమాదేవి చిత్రాన్ని సమర్పిస్తుండగా రాజాసాగి సత్యన్నారాయణరాజు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి మరికొన్ని కీలక సన్నివేశాలు డుంబ్రిగుడ, అరకులోయ ప్రాంతాల్లో చిత్రీకరిస్తామని యూనిట్ సభ్యులు తెలిపారు.



చిత్ర యూనిట్ సభ్యులు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

మారేడుమిల్లి : స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను సీఐ సీహెచ్. గోపాల్‌కృష్ణ శుక్రవారం సందర్శించారు. గంజాయి అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కొంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించాలని కోరారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. గుర్తేడు ఎస్ఐ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

అరకులోయ రూరల్: మాడగడ పంచాయతీ బోసుబెడ్డ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. బోసుబెడ్డకు చెందిన జుము లచ్చం(65) గ్రామ సమీపంలో గల తేనెటీగల పరిశ్రమలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే శుక్రవారం రాత్రి విధులకు వెళుతుండగా కొత్తభల్లుగుడ వైపు నుంచి అరకులోయ వైపు వస్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని స్థానికులు, బంధువులు చికిత్సకోసం అరకులోయ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

క్షతగాత్రులకు అరకు ఎమ్మెల్యే పరామర్శ

మహారాణిపేట(విశాఖ): డుంబ్రిగూడ మండలంలోని గుంటగన్నెల పంచాయతీ పిత్తగూడ గ్రామంలో కాఫీ తోటలో ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వారు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనలో కిల్లో లక్ష్మి, కిల్లో కేశవరావు, వి.సీత గాయపడగా కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ అధికారులు వీరిని కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం వీరిని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు.



కేజీహెచ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ఎర్రబందకు ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణ

చింతపల్లి: చాలాకాలం తరువాత చింతపల్లి మండలం ఎర్రబందకు ఆర్టీసీ సర్వీసును అధికారులు పునరుద్ధరించారు. ఎర్రబొమ్మలు పంచాయతీ కొండవంచుల వరకూ నర్సీపట్నం డిపోకు చెందిన బస్సు తిరిగేది . దీంతో కొమ్మంగి పంచాయతీలోని అనేక గ్రామాలకు చెందిన గిరిజనులకు రాకపోకలకు ఇబ్బంది ఉండేది కాదు. కొమ్మంగి, ఎర్రబొమ్మలు పంచాయతీల్లోని అనేక గ్రామాలకు చెందిన గిరిజనులు ఈ సర్వీసును వినియోగించుకునేవారు. రహదారి అధ్వానంగా ఉండడంతో ఆ ప్రాంతానికి బస్సు సర్వీసు నిలిచిపోయింది. దీంతో సుమారు పదేళ్లపాటు గిరిజనులంతా అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ రహదారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు పూర్తవడంతో రోడ్డు బాగుపడింది. ఫలితంగా కొమ్మంగి మీదుగా ఎర్రబంద వరకూ పాడేరు డిపోకు చెందిన బస్సు సర్వీసు శుక్రవారంనుంచి ప్రారంభమైంది. ఎర్రబొమ్మలు ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు, సర్పంచ్ లోతా పండయ్య, కూటమి నాయకులు సత్యనారాయణ, కాఫీ సంక్షేమ సంఘం నాయకులు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబందలో ప్రారంభించిన ఆర్టీసీ సర్వీసు

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సత్యం(ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో జీయూపీ పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కె.సత్యం (55) గుండెపోటుతో మృతి చెందారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఓ దుకాణం ఎదుట శుక్రవారం ఉదయం ఒక వ్యక్తి చనిపోయి ఉండడాన్ని వ్యాపారులు గమనించారు. దీనిపై ఆరాతీయగా అతను వనుగుమ్మ పాఠశాల ఉపాధ్యాయుడిగా గుర్తించారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు ఎస్ఐ రవీంద్రకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ సమక్షంలో మృతదేహాన్ని ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం రాత్రి వనుగుమ్మ వెళ్లేందుకు మండల కేంద్రంలో ఉపాధ్యాయుడు సత్యం నిరీక్షిస్తూ ఉన్నారని పలు తెలిపారు. రాత్రి సమయం కావడంతో గుండెపోటు వచ్చి ఎవరూ గమనించక పోయి ఉండొచ్చని, దీంతో మృతి చెంది ఉండొచ్చని వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. మృతి చెందిన ఉపాధ్యాయుడు సత్యం స్వగ్రామం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కండివరం. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి,వారు వచ్చిన వెంటనే మృతదేహాన్ని అప్పగించారు. ఉపాధ్యాయుడు సత్యం మృతికి ఎంఈవో కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు మిల్కి, సుభాష్‌చంద్ర, వివిధ ఉపాధ్యాయుల సంఘం నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.